క్లుప్తంగా

ధూమపానం ఆరోగ్యానికి చాలా హానికరం



రెంటచింతల: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, పొగాకు వ్యసనం వలన క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధుల ప్రమాదం ఉందని ఎంపీడీఓ కె.సరోజినిదేవి హెచ్చరించారు. ప్రపంచ పొగాకు నివారణ దినం సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయిలో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు పొగాకు వాడకం వలన వచ్చే అనర్థాలు అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు, హెచ్‌ఎంలు దుర్గా ప్రసాద్, కత్తి రవి, టీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాంబాబు, శీలం కిరణ్, కుమార్, మంగయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ ఏఈగా రోషిణి



పిడుగురాళ్ల: మున్సిపల్ ఏఈగా రోషిణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా రేపల్లె నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్రరావు మాచర్ల మున్సిపల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తాని రోషిణి పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



దాచేపల్లి: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మేడ సైదారావు పొలంలో విద్యుత్ పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై శరీరం అంతా కాలింది. దీంతో సైదారావు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు.

వీఆర్ఓ రాజారావు మృతి

మాచర్ల రూరల్: పట్టణ వీఆర్‌ఓగా పనిచేస్తున్న అందుగుల రాజారావు అనారోగ్యంతో మృతి చెందారు. భౌతిక కాయాన్ని సోమవారం తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను అనుభూతి తెలిపారు.

మెనూ తప్పక పాటించాలి



అచ్చంపేట: ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీపీ స్వర్ణమ్మబాయి తెలిపారు. స్థానిక కస్తూరిబా బాలిక విద్యాలయ వంట ఏజన్సీలకు ఈ మేరకు సూచించారు. సోమవారం ఆమె పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. వంటశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల ఎస్‌వో జ్యోత్స్నతో మాటాడి విద్యార్థులకు ఆహారాన్ని అందించడంలో రాజీ పడొద్దని సూచించారు. ఆమె వెంట్ రమేష్ నాయక్ ఉన్నారు.

పేదలను ఆదుకున్న వెలుగూరి

సత్తెనపల్లి: పేదలకు వెలుగూరి వెంకటేశ్వర్లు చేసిన సేవలు వెలకట్టలేనివి అని, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఏరియా ప్రభుత్వ వైద్యశాల పక్కన ఉన్న వెంకటేశ్వర్లు విగ్రహానికి ఆర్య వైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో 53 వర్ధంతి సందర్భంగా సోమవారం గజమాల వేసి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. దివ్యాంగుడు అయినవోలు శ్రీనివాసరావుకు ట్రై సైకిల్‌ను, నిరుపేద మహిళకు వెట్ గ్రైండర్ అందించారు. వెలుగూరి శరత్ బాబు, జమిలి రాధా కృష్ణమూర్తి ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి నిధుల కేటాయింపులో వివక్ష

- సమస్యలపై నిలదీసిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు
- కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదు..
- మెడికల్ వ్యర్థాల నిర్వహణ అస్తవ్యస్తం
- సెప్టిక్ ట్యాంక్ వాహనాలు నిరుపయోగంపై అసంతృప్తి



పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ వెంకట సుబ్బారావుకు సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్ శ్రీను

పిడుగురాళ్ల: సమస్యలపై కౌన్సిల్‌లో సభ్యులు నిలదీశారు. అభివృద్ధి నిధులు కేటాయింపులో వివక్షపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. మెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఆందోళన వ్యక్తం చేశారు. పిడుగురాళ్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షత వహించారు.

తొలుత మున్సిపల్ సిబ్బంది అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం కౌన్సిలర్లు వారి వార్డుల్లో ఉన్న సమస్యలను లేవనెత్తారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ అప్పిరెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశం జరగాలంటే కోరానికి సరిపడా కౌన్సిల్ సభ్యులు ఉంటేనే మున్సిపల్ సమావేశం నిర్వహిస్తారు. సమావేశం జరగడానికి కావాల్సిన కోరం సభ్యులం అయిన వైయస్సార్ సీపీ కౌన్సిలర్లు కావాలి, కానీ మా కౌన్సిలర్ల వార్డుల్లో అభివృద్ధి పనులు మాత్రం నిర్వహించరా చైర్మన్‌ను నిలదీశారు. తొమ్మిదో వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్ అండ్ బీ బంగ్లాలో ఒకటి, మార్కెట్ యార్డులో మరొకటి రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు కూడా మొదలయ్యాయి . ఇప్పుడు ఆ వాటర్ ట్యాంక్‌లు పూర్తి చేసి పట్టణంలో మిగిలిన వాటర్ పైప్ లైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సరఫరా చేఆయలని కోరారు. గంగమ్మ గుడి వెనక బజార్లో కల్వర్టులు ఏర్పాటు చేయాలని, గణపతి కాంప్లెక్స్ వెనక సైడ్ కాలవలు లేక ఇబ్బందులు పడుతున్నారని, హైస్కూల్ రోడ్డు సీసీ రోడ్డు నిర్మించారు కానీ వాటర్ పైపులైన్లు ఏర్పాటు చేయలేదని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు.

సిమెంట్ అంచనాలు పెంపుదలపై..

16వ వార్డు కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఇసుక ఉచితం అయినప్పుడు సిమెంట్ రోడ్ల వ్యయం కూడా తగ్గాలి కదా అలా తగ్గించకుండా ప్రతి పనికి ఎస్టిమేషన్లు పెంచుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. నీటి సరఫరా కోసం జనరల్ ఫండ్ నుంచి రూ.5.81 కోట్లు ఖర్చు చేయాలనుకోవడం సరికాదన్నారు. జనరల్ ఫండ్ కాకుండా ప్రత్యేక నిధులు నుంచి ఖర్చు చేస్తే బాగుంటుందని చెప్పారు. ఇప్పటికే గతంలో చేసిన పనులకు పూర్తిస్థాయిలో బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఏకంగా జనరల్ ఫండ్ ద్వారానే వాటర్ సంబంధించిన పనులు చేస్తామంటే అది సాధ్యమయ్యే పని కాదని ఈ సందర్భంగా ఆయన కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

డ్రెయిన్‌లోనే వ్యర్థాలు..

రెండో వార్డ్ కౌన్సిలర్ కొక్కెర శ్రీను మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో ఐదు హాస్పిటల్స్ ఉన్నాయని, వాటి ద్వారా వ్యర్థాలు డ్రెయినేజీలోకి వస్తున్నాయని మా ప్రాంతంలో కల్వర్టర్లు, డ్రెయిన్లు తక్షణమే నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరారు. గతంలో టెండర్లు పిలిచే ముందు కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లతో అవగాహన ఉండేది కానీ ఇప్పుడు నేరుగా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌లకు అప్పగించామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంప్రదాయం మంచిది కాదని తెలిపారు. చైర్మన్ స్పెషల్ నిధులు కనీసం ఒక్కొక్క కౌన్సిలర్‌కు రూ.5 లక్షలు చొప్పున ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

కల్వర్టులు నిర్మించాలి

31 వ వార్డు కౌన్సిలర్ షేక్ సైదా వలి మాట్లాడుతూ తమ వార్డులోని పాటిగుంతలలో కల్వర్టు నిర్మించాలని కోరారు. 28వ వార్డు కౌన్సిలర్ నాగేశ్వరావు మాట్లాడుతూ మున్సిపల్ ఆఫీస్‌లో సెప్టిక్ ట్యాంక్ వాహనాలు ఉన్నాయి, కానీ వాటిని ఉపయోగించకుండా మూలన పడేశారు. దీంతో ప్రైవేట్ వ్యక్తులు యూనియన్‌గా ఏర్పడి ప్రజల వద్ద ముక్కు పిండి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్ వాహనాలు ఉపయోగించాలని కోరారు.

ప్రొటోకాల్ పాటించడం లేదు..

27వ వార్డు కౌన్సిలర్ తురక ముక్కంటి తమ వార్డులో అభివద్ధి పనులు చేసిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై తన పేరు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధి పేరు శిలాఫలకం మీద ఏర్పాటు చేయకపోవడం ప్రొటోకాల్‌ని ధిక్కరించినట్లేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త కార్యాలయంలోకి ఎప్పుడో..

కో ఆప్షన్ సభ్యుడు సెట్టుపల్లి పూర్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సుమారు రూ.5 కోట్లతో పరిపాలన బాగుండాలని నూతన మున్సిపల్ భవనాన్ని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మించారు. అందులోకి మార్చుకోకుండా పెచ్చులు ఊడిపోతున్నా పాత భవనంలో కొనసాగించడంపై విస్మయం వ్యక్తం చేశారు. పిడుగురాళ్ల పట్టణం సుందరీకరణలో భాగంగా వెల్కమ్ బోర్డులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు. 12వ వార్డు కౌన్సిలర్ కాంట్రకుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ వార్డులో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వర్షాకాలం కాబట్టి పాములు తిరిగే ప్రాంతం కనుక వెంటనే మా ప్రాంతాల నుంచి నక్కల కాలువ వరకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు స్పందించి మాట్లాడుతూ కౌన్సిలర్ల సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మేనేజర్ రహమతుల్లా, ఏఈ రోషిణి పాల్గొన్నారు.

పరిమితికి మించి అనుమతి లేదు..

గురజాల: పాఠశాలల కింద నడిపే వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.శేషురెడ్డి అన్నారు. స్థానిక దండివాగు సమీపంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు దాటిన బస్సులను పాఠశాలల్లో విద్యార్థులను తీసుకువెళ్లేందుకు ఉపయోగించరాదని చెప్పారు. ఆ బస్సులను వెంటనే సీజ్ చేస్తామన్నారు. ప్రతి పాఠశబూల బస్సుకు తప్పనిసరిగా డ్రైవర్‌తో పాటు క్లీనర్ కూడా ఉండాలన్నారు. వారు యూనిఫాం ధరించాలని బస్సులో విధిగా ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ బాక్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. తప్పనిసరిగా బస్సు తిరిగే రూట్ వివరాలతో పాటు విద్యార్థుల పేరు, తండ్రి పేరు, సెల్ నంబరు ఉండాలన్నారు. ఆటోల్లో విద్యార్థులకు కేవలం ఆరుగురికి మాత్రమే పరిమితం కావాలని కోరారు.

యువతి అదృశ్యం



రెంటచింతల: మండల పరిధిలోని పాలువాయి జంక్షన్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉప్పుతోళ్ల శ్రీను, గోపమ్మ మూడో కుమార్తె రాజేశ్వరి పాలువాయి జంక్షన్‌లోని పెట్రోల్ బంక్ సమీపంలో నున్న ఓ నర్సరీలో కూలీ పనులకు వెళ్తోంది. ఈ నేపథ్యంలో ఎప్పటిలానే జూన్ 27 న ఉపాధి కోసం నర్సరీ పనులకు వెళ్లిన రాజేశ్వరి సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం రాత్రి ఆమె తల్లి గోపమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు

తహసీల్దార్ మధుబాబు



ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుబాబు

పిడుగురాళ్ల: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యానికి ఎంతో మేలు అని తహసీల్దార్ జే మధుబాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు కల్తీ ఆహార ఉత్పత్తుల నుంచి విముక్తి కల్పించి నాణ్యమైన ప్రకృతి ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను అందించే లక్ష్యంతో రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేయాలని సూచించారు. రైతు సాధికార సంస్థ నిర్వాహకులు ప్రతి సోమవారం ఈ విక్రయ కేంద్రాన్ని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తారని ప్రజలు, మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు కూడా ఈ విధంగా స్టాల్స్ ఏర్పాటు చేసి అందరికి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందజేయడానికి ముందుకు వస్తున్నారని, వారిని ప్రోత్సహించి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి ప్రజలందరూ మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. మాస్టర్ ట్రైనర్ బాజీ బాబు మాట్లాడుతూ ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అందులో అనేక రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని వివరించారు. అదే విధంగా మహిళా మార్ట్, రైతుబజార్‌లో కూడా ఈ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శర్మ, ఎస్ఎఫ్ఏ బి.అప్పలరాజు, మోడల్ మేకర్ హసీనా, యూనిట్ ఇన్‌చార్జి మస్తాన్ బి, ఐసీఆర్‌పీలు పురుషోత్తం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మూడు బైక్‌లు స్వాధీనం



మాచర్ల రూరల్: పట్టణ పరిధిలోని ఇద్దరు దొంగలను అరెస్టు చేసి, వీరి నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గురజాల డీఎస్పీ బి.జగదీష్ తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న మంజుల దాసు ఇంటి ముందు వాహనాన్ని పార్క్ చేయగా పోయిందని, ఆ మేరకు ఆదివారం ఫిర్యాదు చేశారన్నారు. అర్బన్ సీఐ ప్రభాకర్‌రావు, ఎస్ఐ జి.సంధ్యారాణి ఆధ్వర్యంలో రెండు టీమ్స్ 180 సీసీ కెమెరాల్లో పరిశీలించినట్లు చెప్పారు. మాచవరం మండలం, గంగిరెడ్డిపాలేనికి చెందిన మల్లెల దేవకుమార్, మండలపాటి గోపికృష్ణలను విచారించి, అరెస్టు చేసి వారి వద్ద నుంచి మూడు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు విధించినట్లు తెలిపారు.

ఆయిల్ ఫాం సాగు ఎంతో లాభదాయకం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మాచవరం: ఆయిల్ ఫాం సాగు ఎంతో లాభదాయకమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పిన్నెల్లిలో ఉద్యాన శాఖ, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఆయిల్ ఫాం ప్లాంటేషన్‌పై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మొదటి విడతగా ఆయిల్ పామ్ సాగుకు 8 మండలాలను గుర్తించారని, అందులో నియోజకవర్గంలో మాచవరం, పిడుగురాళ్ల మండలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అంతర్జాతీయంగా వంట నూనెలకు డిమాండ్ పెరగడంతో, రాష్ట్రంలో ఆయిల్ ఫాం సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఐ.వెంకట్రావు మాట్లాడుతూ హెక్టారుకు 150 మొక్కలను నూరు శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్నారు.

హెక్టారుకు నాలుగు సంవత్సరాల పాటు రైతుకు సాగు ప్రోత్సాహంగా రూ.21 వేలు రాయితీ అందిస్తామని చెప్పారు. సుమారు 250 ఎకరాల్లో మొక్కలు నాటటం జరుగుతుందని వివరించారు. సాగుకు నీటి వసతి తప్పని సరిగా ఉండాలన్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వివిధ పంటల యాజమాన్యంపై స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాల్యూ ఆయిల్ కంపెనీ సీఈఓ పి.రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఎం.రామ్మోహన్, డాట్ సైంటిస్టు ఎం.నగేష్, ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు, ఉద్యాన శాఖ అధికారులు ఎం.అంజలీబాయి, వై.మోహన్, ఎంపీడీఓ డి.విష్ణు చిరంజీవి, తహసీల్దారు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఏఓ రామమ్మ, ఎంఐఈ బద్దు నాయక్, ఏరియా మేనేజర్ ఎం.నవీన్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

రెంటచింతల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తన శుద్ధి చేయడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి సాగు చేసే రైతులు పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపిన నీటిలో ఎంపిక చేసుకున్న విత్తనాలను పోయగా పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేయాలని చెప్పారు. నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలను నారు పోసుకోవడానికి వాడుకోవాలన్నారు. కిలో వరి విత్తనానికి ఒక లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండజిమ్ కలిపి 24 గంటలు నానబెట్టిన అనంతరం మరో 20 నుంచి 24 గంటల పాటు మంచినీటిలో విత్తనాన్ని ఉంచి తరువాత నారు మడులలో చల్లుకోవాలని సూచించారు. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని కోరారు. మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లే ముందు 0.2 శాతం క్లోరిప్రైరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లుకోవడం వలన నారుమడిలో ఆకు తినే పురుగు, ఉల్లికోడు, మొవ్వపురుగు పంటకు సోకవన్నారు. అదే విధంగా ఒక కిలో పత్తి విత్తనానికి 8 గ్రాముల ట్రికో డెర్మావిరిడితో, ఒక కిలో మిరప విత్తనాన్ని 8 నుంచి 10 ఎంఎల్ గాచో ద్రావణంలో విత్తన శుద్ధిచేయడం మంచిదన్నారు. విత్తన శుద్ధి చేసి సాగు చేస్తున్న పంటలను చీడ, పీడల నుంచి కాపాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు. పత్తి చుట్టూ అంతర పంటగా 4 సాళ్లకు ఒక సాలుకు కంది, మినప, పెసర పంటలను సాగుచేసు కోవచ్చునన్నారు. మాగాణి చుట్టు గట్టుపై కందిపంటను రైతులు అంతర పంటగా సాగుచేయడం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. ప్రభుత్వం కూడా వ్యవసాయశాఖ ద్వారా అంతర పంటలను సాగుచేసే రైతులను ప్రోత్సహిస్తుందని వెల్లడించారు.

వడియరాజుల సంఘం అధ్యక్షునిగా హనుమంతరావు



నియామక పత్రం అందజేస్తున్న సంఘం నేతలు

దాచేపల్లి: వడియరాజుల సంఘం గురజాల నియోజకవర్గం అధ్యక్షుడిగా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడికి చెందిన వైఎస్సార్ సీపీ నేత పల్లపు హనుమంతరావు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, హనుమంతరావుకు సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బేబీ రాణి మాట్లాడుతూ వడియరాజులు ఐకమత్యంతో ఉండాలని, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అధ్యక్షునిగా నియ మీతులైన హనుమంతరావుని వైఎస్సార్ సీపీ నేతలు మందపాటి రమేష్ రెడ్డి, షేక్ జాకీర్ హుస్సేన్, కోటా కృష్ణ, షేక్ సుభాని, దేవళ్ల వీరస్వామి, ఉప్పుతల యల్లయ్య, తమ్మిశెట్టి రామకృష్ణ తదితరులు సన్మానించారు.


స్మార్ట్ మీటర్‌లను అడ్డుకోండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు

సత్తెనపల్లి: స్మార్ట్ విద్యుత్ మీటర్ బిగించడానికి వస్తున్న సిబ్బందిని అడ్డుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పుతుంబాక భవన్‌లో సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు స్మార్ట్ మీటర్‌లకు వ్యతిరేకంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే ఆ ప్రభుత్వాన్ని బాదుడే బాదుడు అని ఊదరగొట్టిన అప్పటి ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు, ఇప్పుడు రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై భారం వేశారని ఆరోపించారు. బడా కంపెనీల లాభాలతో అధినేతల జేబులు నింపుకోవడం కోసం ప్రజలపై విద్యుత్ బిల్లులు మోత వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపులు, పరిశ్రమలకు యూనిట్‌కు ఆరు పైసలు ఉన్న విద్యుత్ సుంకాన్ని రూపాయికి పెంచారని, కూటమి ప్రభుత్వం దానికి చట్టబద్ధత కల్పించిందని విమర్శించారు. స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిల్లులు ఆన్‌లైన్‌లో పంపుతారని పేర్కొన్నారు. డబ్బు మొత్తం నెలవారీ వాయిదాల్లో వసూలు చేస్తారని తెలిపారు. ఈ మీటర్లను బిగించడానికి వస్తే అడ్డుకోవాలని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆశ్రమ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ



ఫ్యాన్లు అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని ఎత్తిపోతల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు మాచర్ల రోటరీ క్లబ్, లవ్ అండ్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పది సీలింగ్ ఫ్యాన్‌లను పాఠశాల హెచ్‌ఎం దుర్గాభవానికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. రోటరీక్లబ్ డెప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలలోని జ్ఞానంతో పాటు సొంత ఆలోచనలతో అధ్యయనం చేయాలని కోరారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంలో రోటరీక్లబ్ పాత్రను ప్రిన్సిపాల్ దుర్గాభవాని ప్రసంసించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సెక్రటరి నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపరెడ్డి లక్ష్మీ, ప్రోగ్రాం కన్వీనర్ పఠాన్ నాగూర్ వలి, జె.వి.కె.ఎస్.ప్రసాద్, కూరపాటి శ్రీనివాసరాజు, తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, నిమ్మగడ్డ రమేష్, రవికుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీపై సాగు పరికరాలు పంపిణీ



ముప్పాళ్లలో డ్రోన్ అందిస్తున్న దృశ్యం

ముప్పాళ్ల: రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం వీటిని పంపిణీ చేశారు. మండలంలోని చాగంటి వారిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. సబ్సిడీ డ్రోన్‌కు ఇరుకుపాలెం గ్రామానికి చెందిన చంద్రబోస్, బొల్లవరం గ్రామానికి చెందిన సిద్ధివిఘ్నేశ్వర గ్రూప్‌లు ఎంపికైనట్లు చెప్పారు. వారికి డ్రోన్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గోగి నేని కోటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి శ్రీధరరెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలంలోని గోళ్ళపాడులోని కేజీబీవీ పాఠశాలలో జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. దాదాపు రూ.2 కోట్లతో అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టనున్నారు. గ్రామ సర్పంచి గోపు అప్పమ్మ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి



తహసీల్దార్ అర్జీలు అందిస్తున్న పేదలు

క్రోసూరు: ఎన్నికల సందర్భంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో భాగంగానిరుపేదలకు నివేశ స్థలాలిచ్చి గృహ నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ వీవీ నాగరాజుకుకు అర్జీలను అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు భైరవపట్నం రామకృష్ణ, పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. క్రోసూరు సహా వివిధ గ్రామాలలో నివేశ స్థలాలు లేని నిరుపేదలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అర్హత కలిగి ఉన్నా కొందరు నిజమైన లబ్ధిదారులను ప్రభుత్వపరంగా రీ సర్వే పింఛను అందడం లేదన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, రైతు సంఘం కార్యదర్శి కంచేటి పెద్దబ్బాయి పాల్గొన్నారు.